సాక్షి
కర్నూలు
బుధవారం । 17 । జనవరి । 2024



సంబరాల సంక్రాంతి

మూడు రోజుల సంక్రాంతి పండుగ సంబరాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. సంప్రదాయం ఉట్టిపడేలా పార్వేట ఉత్సవాలు, ఆటల పోటీలు నిర్వహించారు. .. 8లో ▸



దొంగలు ఊడ్చేశారు

సంక్రాంతికి కొందరు ఇళ్లకు తాళాలు వేసి సొంతూర్లకు వెళ్లగా పసిగట్టిన దొంగలు ఊడ్చేశారు. ఆదోని, కర్నూలులో 9 ఇళ్లలో దొంగలు పడి దొరికినంతా దోచుకెళ్లారు. .. 8లో ▸



సుంకేసుల నుంచి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

హంద్రీనదికి చేరిన జీడీపీ నీరు

- తీరిన కోడుమూరు వాసుల మంచినీటి సమస్య



హంద్రీలోని మంచినీటి పథకాల వద్దకు చేరుకున్న జీడీపీ నీరు

కోడుమూరు రూరల్: రెండు రోజులుగా గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన 80 క్యూసెక్కుల నీరు వర్కూరు వద్ద హంద్రీనదిలోకి చేరింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల హంద్రీనది ఎండిపోవడంతో నదీ పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి విడుదలైన నీరు ప్రస్తుతం కోడుమూరు హంద్రీనదిలోని మంచినీటి పథకాల వద్దకు చేరాయి. దీంతో పట్టణవాసుల నీటి కష్టాలు తొలగిపోయాయి. మరో నాలుగైదు రోజులు నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే గోరంట్ల గ్రామాన్ని చేరే అవకాశం ఉంది.

నేడు, రేపు జీపీడీపీపై శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 17, 18 తేదీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ. నాగరాజు నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలు ఈ శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 17న జరగనున్న శిక్షణకు అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సర్పంచులు, ఆయా గ్రామ పంచాయతీల్లోని 50 శాతం మంది వార్డు సభ్యులు, 50 శాతం మంది గ్రామ సచివాలయ ఉద్యోగులు, 50 శాతం మంది ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు. అలాగే 18న జరగే శిక్షణకు కూడా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో పాటు మిగిలిన 50 శాతం మంది ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు అవసరమైన ఈ శిక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించి హాజరు కావాలని డీపీఓ కోరారు. మండలాల్లోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు కూడా ఈ శిక్షణలో పాల్గొనాలన్నారు. డివిజినల్ పంచాయతీ అధికారులు, డీసీఆర్‌పీలు ఈ శిక్షణ కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూడాలన్నారు.

19 నుంచి ఇంటర్ ప్రీఫైనల్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్ఐఓ గురువయ్య శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 19న సెకండ్ ల్యాంగ్వేజ్, 20న ఇంగ్లిష్–1, 22న మ్యాథ్స్ 1ఏ, బాటనీ 1, సివిక్స్ 1, 23న మ్యాథ్స్1బీ, జువాలజీ 1, హిస్టరీ 1, 24న ఫిజిక్స్1 , ఎకనామిక్స్ 1, 25న కెమిస్ట్రీ 1, కామర్స్1 పరీక్షలు జరుగుతాయన్నారు. సెకండ్ ఇయర్ విద్యార్థులకు 19న సెకండ్ ల్యాంగ్వేజ్ 2, 20న ఇంగ్లిష్ 1, 22న మ్యాథ్స్ 2ఏ, బాటనీ 2, సివిక్స్ 2, 23న మ్యాథ్స్ 2బీ, జువాలజీ 2, హిస్టరీ 2, 24న ఫిజిక్స్ 2, ఎకనామిక్స్ 2, 25న కెమిస్ట్రీ 2, కామర్స్ 2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

ప్రగతి 'వెలుగులు'

- విద్యుత్ రంగంలో గణనీయమైన అభివృద్ధి
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో విరివిగా సబ్ స్టేషన్ల నిర్మాణం
- 791 పరిశ్రమలకు సింగిల్ విండో సిస్టమ్‌లో కనెక్షన్లు
- వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార రంగాలకు నాణ్యమైన విద్యుత్
- లో, హైఓల్టేజీ, లైన్ లాస్ సమస్యలకు పరిష్కారం



220 కేవీ సబ్ స్టేషన్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయం.. పారిశ్రామికం, వ్యాపారం.. ఇలా ఏ రంగం తీసుకున్నా.. అభివృద్ధికి విద్యుత్ చాలా అవసరం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి (2019) నుంచి ఇప్పటి వరకు అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చారు. ఇందుకోసం విరివిగా సబ్ స్టేషన్లను నిర్మించారు. కొత్త విద్యుత్ లైన్లు వేశారు. విద్యుత్ సమస్యలు లేకపోవడంతో జిల్లాలో ఐదేళ్లలో 791 పరిశ్రమలు ఏర్పడ్డాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. వ్యవసాయానికి పగటిపూటనే 9 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో సాగు ఇబ్బందులు తొలగి బంగారు పంటలు పండాయి. జాప్యం లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో వ్యాపార రంగం కూడా అభివృద్ధి చెందింది.

33 కేవీ సబ్ స్టేషన్‌ల నిర్మాణం

ఐదేళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో డిస్కమ్ ద్వారా పెద్ద ఎత్తున 33 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మించారు. పత్తికొండ, తుగ్గలి, ఆళ్లగడ్డ, రుద్రవరం, డోన్, వెల్దుర్తి, చాగలమర్రి, హాలహర్వి, శిరివెళ్ల, ఆదోని, కొతాళం, ఆస్పరి, ప్యాపిలి, కోడుమూరు, నంద్యాల మండలాల్లో 33 కేవీ సబ్ స్టేషన్‌లు 23 నిర్మించారు. ఇందుకు రూ.35.81 కోట్లు వ్యయం చేశారు. వ్యవసాయానికి పగటి పూటనే 9 గంటల విద్యుత్ ఇచ్చేందుకు ఐదు సబ్ స్టేషన్‌లు నిర్మించారు. దీన్‌దయాల్ యోజన కింద (డీడీయూజీజేవై) ఆదోని, నంద్యాల, డోన్ ప్రాంతాల్లో 33 కేవీ సబ్ స్టేషన్ నెలకొల్పారు. టీ అండ్ డీ. పీఎఫ్‌సీ, నార్మల్ ప్లాన్ కింద సబ్ స్టేషన్‌లు నెలకొల్పడంతో లో ఓల్టేజీ సమస్యలు తొలగాయి. ఇవేగాక కోట్లాది రూపాయల వ్యయంతో పలు 33 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మాణంలో ఉన్నాయి.

రూ.19.54 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్లు

జిల్లాలో హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం (హెచ్ఎన్ఎస్ఎస్)లో భాగంగా కృష్ణగిరి, తుగ్గలి మండలం నుసుసురాళ్ల ప్రాంతాల్లోని 33 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మించారు. హెచ్ఎన్ఎస్ఎస్ విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.5.27 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్‌లు నెలకొల్పారు. రైల్వేలైన్ విద్యుద్దీకరణ కోసం వెల్దుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో రూ.9.53 కోట్లతో 220 /11 కేవీ సబ్ స్టేషన్ నెలకొల్పారు. కోవెలకుంట్ల ప్రాంతంలోని ముదిగేడులో రైల్వేకి సంబంధించి రూ.4.74 కోట్లతో 132/33 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మించారు. రూ.19.34 కోట్లతో రైల్వే లైన్ విద్యుద్దీకరణ, హెచ్ఎన్ఎస్ఎస్ కోసం 220 కేవీ, 132/11 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మించడం విశేషం.

రూ.200 కోట్లతో విద్యుత్ లైన్‌లు

అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం లక్ష్యంగా 220 కేవీ సబ్ స్టేషన్‌లతో పాటు లైన్‌లు కూడా వేస్తున్నారు. జమ్మలమడుగులోని 400 కేవీ సబ్ స్టేషన్ నుంచి బేతంచెర్లకు 220 కేవీ లైన్ వేస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి విద్యుత్ లైన్ రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి అటవీశాఖ అనుమతులు కూడా వచ్చాయి. విద్యుత్ లైన్ కోసం ట్రాన్స్ కో రూ.100 కోట్లు ఖర్చు చేస్తోంది. ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లి రూ.15.50 కోట్లతో 220 కేవీ స్విచ్ సబ్ స్టేషన్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కృష్ణగిరి లిఫ్ట్ ఇరిగేషన్ కోసం కృష్ణగిరి నుంచి నుసుసురాళ్ల వరకు రూ.20.53 కోట్లతో 220 కేవీ లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కర్నూలు కార్బైడ్ ఫ్యాక్టరీ వద్దనున్న 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి శెట్టిపల్లి వరకు రూ.55.50 కోట్లతో 220 కేవీ లైన్ వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

టీడీపీ హయాంలో..

కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు..గృహ వినియోగంతోపాటు ఇతర అవసరాలకు కూడా అరకొర విద్యుత్ ఇచ్చేవారు. వ్యవసాయానికి ఏడుగంటల ఉచిత విద్యుత్ విడతలవారీ కూడా ఇవ్వలేని దుస్థితి. కరెంట్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో పరిశ్రమలు మూత వేసుకోవాల్సి వచ్చేది. లోఓల్టేజీ.. హైఓల్టేజీ సమస్యలు వినియోగదారులకు తీవ్ర నష్టాలను మిగిల్చేవి. మంచి నీటి సరఫరా సమయంలో సైతం విద్యుత్ కోతలు ఉండటంతో ప్రజలు దాహార్తితో అల్లాడేవారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

కోట్ల రూపాయలు ఖర్చు చేయడంతో విద్యుత్ రంగం అభివృద్ధి చెందింది. వ్యవసాయానికి అంతరాయం లేకుండా తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. ఆకస్మిక కోతలు లేకుండా గృహ అవసరాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తున్నారు. అడిగిన వెంటనే పరిశ్రమలకు కనెక్షన్ మంజూరు చేస్తున్నారు. సబ్‌స్టేషన్లు విరివిగా నిర్మించడంతో లోఓల్టేజీ.. హైఓల్టేజీ సమస్యలు తగ్గుముఖం పట్టాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఉమ్మడి కర్నూలులో విద్యుత్ కనెక్షన్లు పెరిగాయి.

2019 నుంచి విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

సంవత్సరం	ఇచ్చిన కనెక్షన్‌లు
2019	69,393
2020	64,001
2021	56,267
2022	60,159
2023	45,046
మొత్తం	2,94,866

ఐదేళ్లలో 2.94 లక్షల కనెక్షన్లు

వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ అవసరాలకు ఐదేళ్లలో 2,94,866 కనెక్షన్‌లు ఇచ్చారు. ఏపీఎస్‌పీడీసీఎల్ ఉమ్మడి కర్నూలు జిల్లా సర్కిల్‌లో ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, కర్నూలు, కర్నూలు రూరల్, నంద్యాల డివిజన్‌లు ఉన్నాయి. ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ కింద పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోంది. వీటికి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా విద్యుత్ కనెక్షన్‌లను జాప్యం లేకుండా ఇస్తున్నారు. ఐదేళ్లలో 791 పరిశ్రమలకు కనెక్షన్‌లు ఇచ్చారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి 57,878 విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆదోని డివిజన్‌లో 51,638, ఎమ్మిగనూరు డివిజన్‌లో 55,634, డోన్ డివిజన్‌లో 37,273, కర్నూలు డివిజన్‌లో 53,616, కర్నూలు రూరల్ డివిజన్‌లో 19,241, నంద్యాల డివిజన్‌లో 77,559 ప్రకారం కనెక్షన్లు ఇచ్చారు.

అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్



2019 నుంచి ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. లోఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యల పరిష్కారం, లైన్‌లాస్‌ను అరికట్టేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాం. ఇందు కోసం ఉమ్మడి జిల్లాలో 23 సబ్ స్టేషన్‌లు నిర్మించడంతో పాటు లైన్లు అభివృద్ధి చేశాం. అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్ అందుతోంది. డొమెస్టిక్, కమర్షియల్ కనెక్షన్‌లు సత్వరం ఇస్తున్నాం. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సేవా లోపం ఏర్పడితే జరిమానాలు కూడా విధిస్తున్నాం.

– ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్దాం

- ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాదు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈనెల 19వ తేదీన జరిగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి కుల,మతాలకు అతీతంగా తరలివెళ్దామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయవాడ స్వరాజ్య మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19వ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కుల,మతాలు, ప్రాంతీలబేధాలు లేకుండా హాజరై విజయవంతం చేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. స్మృతి వనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరిని ఆకర్షించేలా అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపేలా మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటేన్‌లు, లైబ్రరీ వంటి సదుపాయాలతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. విజయవాడకే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచే అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలి రావాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాట ఓబులేషు, నాయకులు సుకుమార్, నవీన్, గద్ద రాజశేఖర్ పాల్గొన్నారు.

తిరుపతిలో హెల్తీ గ్రామ పంచాయతీపై జాతీయ సదస్సు

కర్నూలు(అర్బన్): తిరుపతిలో ఈ నెల 18,19,20 తేదీల్లో హెల్తీ గ్రామ పంచాయతీ అనే అంశంపై మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజునాయుడు చెప్పారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సదస్సుకు హాజరు కానున్నారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, రెండు జిల్లాల పంచాయతీ అధికారులతో పాటు పీఆర్ అండ్ ఆర్‌డీకి చెందిన పలువురు అధికారులు ఈ సదస్సుకు హాజరవుతున్నట్లు చెప్పారు.

వెడలినాడు చూడరో... దేవదేవుడు

- సామాన్యుడి చెంతకు బయలుదేరిన అహోబిలేశుడు
- వైభవంగా పార్వేట మహోత్సవానికి శ్రీకారం
- 46 రోజులు 33 గ్రామల్లో కొనసాగనున్న పార్వేట



పార్వేటకు బయలు దేరిన అహోబిలేశుడిని దర్శించుకుంటున్న భక్తజనం



స్వామివార్లకు కుంభహారతి ఇస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: సకల దేవతలు హాజరయ్యే తమ కల్యాణోత్సవానికి సామాన్యుడు సైతం కుటుంబ సమేతంగా హాజరవ్వాలని భక్తకోటిని ఆహ్వానించేందుకు సాక్షాత్తు ఆ దేవదేవుడే గ్రామాలకు బయలుదేరాడు. కులమతాలకు అతీతంగా సకుటుంబ సపరివార సమేతంగా తమ వివాహ వేడుకలకు తరలి రావాలని ఊరూరా తమ భక్తులను పిలిచేందుకు అహోబిలేశుడు కొండ దిగారు. ప్రపంచంలో ఎక్కడా జరగని ఆ దివ్యోత్సవానికి దిగువ అహోబిలం వేదికగా నిలిచింది. వేదపండితుల వేద మంత్రోచ్చారణలు, చెంచుల సంప్రదాయ నృత్యాలు, భక్తకోటి గోవింద నామస్మరణల నడుమ 'అహోబిలేశుడి పార్వేట' మహోత్సవానికి అంగరంగ వైభవంగా అంకురార్పణ జరిగింది. సంక్రాంతి పండుగ ముగిసిన మరుసటి రోజు (కనుమ) పారువేట ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీ జ్వాలానృసింహస్వామిని ఆదివారం దిగువ అహోబిలం తోడ్కొని వచ్చి అక్కడ వెలసిన ప్రహ్లాదవరద స్వామితో కలిపి ప్రత్యేకంగా అలంకరించిన యాగశాలలో కొలువుంచారు. ఇరువురికి తలపాగా చుట్టి వేటగాళ్లలా ప్రత్యేకాలంకరణ గావించి పార్వేట జరుగనున్న 46 రోజులు స్వామి వెంట నడిచే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక పార్వేట పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదుడు, జ్వాలా నరసింహ స్వాముల సమక్షంలో అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహదేశికన్ కుంభహారతి నిర్వహించారు. అనంతరం అన్నకూటోత్సవం (46 రోజులు స్వామికి అవసరమైన ఆహారం) అర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ పల్లకీలో ఉత్సవమూర్తులను కొలువుంచారు. భక్తుల గోవిందా నామస్మరణలు హోరెత్తగా ఉత్సవ పల్లకీ ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో నల్లమల చెంచులు పల్లకీపై విల్లంభులు ఎక్కుపెట్టి బాణాలు సంధించారు. తమ ఆడబిడ్డ అయిన చెంచు లక్ష్మీ అమ్మవారిని స్వామి వివాహం చేసుకునేందుకు భక్తులను ఆహ్వానించేందుకు వెళ్తుండటంతో సంతోషంగా బాణాలు వదులుతూ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాలను ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సామ్యానారాయణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అహోబిలేశుని పార్వేట 46 రోజుల పాటు 33 గ్రామల్లో కొనసాగనుంది. ఉత్సవ పల్లకీ ఏగ్రామానికి వెళితే ఊరిలో పండుగ వాతావరణం నెలకొంటుంది.

వైభవోపేతం.. కల్యాణోత్సవం

- కనుల పండువగా పార్వతీ, పరమేశ్వరుల లీలా కల్యాణం
- కనుమ రోజు స్వామిఅమ్మవార్లకు కైలాసవాహన సేవ



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



కైలాసవాహన సేవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పార్వతీ, పరమేశ్వరుల లీలాకల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీశైలక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో, ప్రతిరోజు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించబడుతుండగా మకర సంక్రాంతి రోజున మాత్రం పార్వతీ, పరమేశ్వరుల లీలా కల్యాణోత్సవం జరిపించడం విశేషం. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలోని స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవ కల్యాణం జరిపించారు. మాంగల్యపూజ జరిపించి అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. తరువాత తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ఉత్తరీయానికి, అమ్మవారికొంగుతో బ్రహ్మముడి వేసి స్వామిఅమ్మవార్లకు పునఃపూజ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీస్వామిఅమ్మవార్లకు నంది వాహనసేవ నిర్వహించారు. ఐదవ రోజు మంగళవారం స్వామిఅమ్మవార్లకు కైలాసవాహనసేవ నిర్వహించారు. కై లాసవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ ఏఈవో మోహన్, పీఆర్వో టీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న పెళ్లికి చెంచుల ప్రత్యేకం

సంప్రదాయాన్ని అనుసరించి చెంచులు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రవీంద్రారెడ్డి దంపతులు నూతనవస్త్రాలకు, ఆకులతో అల్లిన ఆభరణాలకు రాజగోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తలపై పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈత ఆకులతో అల్లిన కంకణాలు, బాసికాలు, స్వామివారికి యజ్ఞోపవీతం, అమ్మవారికి వడ్డాణం, మెట్టెలు, మెడలో అలంకరించేందుకు ఆకులతో అల్లిన హారాలను సమర్పించారు. కల్యాణ సమయంలో చెంచు భక్తులు సమర్పించిన ఈ ఆభరణాలన్నింటిని స్వామిఅమ్మవార్లకు అలంకరించారు. కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలోని పలు గూడేలకు చెందిన 200 మందికిపైగా చెంచు భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

నాడు: ఆస్పరి పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ డబ్బులు కోసం వేసి ఉన్న వృద్ధులు





నేడు: ఆస్పరిలో ఇంటి దగ్గర ఉన్న రంగమ్మ అనే వృద్ధురాలికి పింఛన్ డబ్బును అందజేస్తున్న వలంటీర్ శివకుమార్

అవస్థలు తొలగించి.. ఆనందం పంచి

టీడీపీ హయాంలో ప్రతి నెలా పింఛన్ అందుకోవడానికి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు చాలా ఇబ్బందులు పడేవారు. పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవారు. ఉదయం కార్యాలయం వద్దకు వెళితే సాయంత్రం వరకు కూడా పింఛన్ డబ్బు అందేది కాదు. అప్పటి వరకు భోజనం చేయకుండా నిరీక్షించాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ పంపిణీలో మార్పు వచ్చింది. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటి వద్దనే పింఛన్ అందుతోంది. ప్రతి నెలా 1వ తేదీనే పించన్ డబ్బు అందుతుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ఆస్పరి

క్లుప్తంగా

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన డాక్టర్ రఘునాథన్ కుటుంబ సభ్యులు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. శ్రీమఠంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేసినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాస రావు తెలిపారు. అలాగే శ్రీమఠం గోశాలలో పశు గ్రాస సేవ కింద మరో రూ.4 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కేసు నమోదు

కర్నూలు : కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన బోయ రాజుతో పాటు మరో ఇద్దరు బంధువులపై సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు బోయ నడిపి నాగన్న, కొడుకులు నడిపి సంజీవ, నడిపి అశోక్, బంధువు నవీన్‌లపై ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉలిందకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే 651/2లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ముద్దాయి బోయ నడిపి నాగన్న సాగు చేసుకుంటున్నాడు. అయితే, ఆ భూమిని వ్యాపారులకు విక్రయించడానికి బోయ రాజు ప్రయత్నిస్తున్నాడని కొంతకాలంగా నడిపి నాగన్న మనసులో కక్ష పెంచుకున్నాడు.దీనికితోడు తన ఇంటి పక్కన గల ఇంటి స్థలం కొనుగోలు విషయంలో కూడా రాజు అడ్డు తగలడంతో ఇద్దరి మధ్య వైరం మరింత పెరిగింది. ఈ క్రమంలో నడిపి నాగన్నతో పాటు అతని కొడుకులు పథకం ప్రకారం సోమవారం రాత్రి చెన్నకేశవస్వామి గుడి వద్ద రాజుపై పిడిబాకు, పంచ్ రాడ్లతో దాడిచేసి గాయపరిచారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పీఎస్ ట్రైనీ డీఎస్పీ భావన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు : కర్నూలు–దూపాడు రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఎలక్ట్రికల్ పోల్ 248/7/బి దగ్గర 30 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. రైల్వే కీ మ్యాన్ గుర్తించి సోమవారం రైల్వే పోలీసులకు సమాచారమిచ్చాడు. పసుపు రంగు ఫుల్ షర్టు, బూడిద రంగు ప్యాంటు ప్రమాదంలో పూర్తిగా చిరిగి చీలికలయ్యాయి. దూపాడు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్లే రైలు ఢీకొట్టడం వల్ల శరీరం మొత్తం సుమారు 450 అడుగులు ఈడ్చడం వల్ల నుజ్జునుజ్జు అయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. విషయం తెలిసిన వెంటనే రైల్వే పీఎస్ ఎస్ఐ శ్రీనివాస రావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు సెల్: 9441759875 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.


చిన్నకంబలూరులో కబడ్డీ పోటీలు


ఉయ్యాలవాడలో స్వామివార్ల పల్లకోత్సవం


బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెలో భక్త జనసందోహం మధ్య చెన్నకేశవస్వామి ఊరేగింపు

సంబరాల సంక్రాంతి

సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల వేడుకలో తొలి రోజు ఆదివారం భోగభాగ్యాలనిచ్చే భోగి, రెండోరోజు సోమవారం సరదాల సంక్రాంతి, మూడోరోజు మంగళవారం కనుమ పండుగను ప్రతి ఒక్కరు తమ బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకున్నారు. ఊరూరా నిర్వహించిన ముగ్గుల పోటీలు, క్రీడా పోటీల్లో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వేట ఉత్సవాలు వేడుకగా సాగగా.. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – సాక్షి నెట్‌వర్క్



సి. బెళగల్: నదిలో ప్రత్యేక పూజలకు హాజరైన గ్రామస్తులు, ప్రాతకోటలో హోరాహోరీగా బండలాగుడు పోటీలు


కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్ నగర్‌లో ముగ్గుల పోటీలు


హొళగుందమండలం హొన్నూరు కొట్టాలలో భోగి మంట


నంద్యాల పట్టణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి రథోత్సవం


ముగ్గుల్లో అమ్మవారు


ఆస్పరి మండలం కైరుప్పలలో ముగ్గులు వేస్తున్న మహిళలు


పండుగను ప్రతిబింబించేలా రంగవల్లి


కర్నూలు గోశాలలో గంగిరెద్దు విన్యాసం



తరిగోపులలో భక్తజనం మధ్య శ్రీలక్ష్మీచెన్నకేశవ, అనంతనాగేశ్వర స్వామివార్ల రథోత్సవం, రథంలో ఆశీనులైన దేవతామూర్తులు



పగిడ్యాల మండలం ప్రాతకోటలో విద్యార్థినుల భరత నాట్యం ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

బొమ్మలసత్రం: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. పండుగను పురస్కరించుకుని రెండురోజులు జిల్లాలోని వివిధ పోలీ స్టేషన్ల పరిధిలో పోలీసులు,సెబ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. మొత్తం 26 కేసులు నమోదుచేసి 14 మంది ముద్దాయిలను అరెస్ట్ చేశారు. నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 182 లీటర్ల సారా, 10 డీపీఎల్ కేసుల్లో 325 డీపీఎల్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. 2,950 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలో కోడి పందాలు ఆడుచుండగా వారిపై దాడి చేసి 15 మందిని అరెస్ట్ చేసి, 10 కోళ్లను, 40 మోటార్ సైకిళ్లను, 19,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 13 కేసులు నమోదు చేశారు. 51 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి అధికారుల ఎదుట హాజరు పరిచారు. డోన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో మట్కా కేసు నమోదు చేసి రూ.3900, నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 12 మంది నుంచి 1,28,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. పై వివరాలను మంగళవారం నంద్యాలలోని తన కార్యాలయంలో ఎస్పీ విలేకరులకు వెల్లడించారు.


నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పండుగ పూట విషాదం

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించి బాధిత కుటుంబంలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. కొండమీదపల్లె గ్రామానికి చెందిన గజ్జల చిన్న సుబ్బారెడ్డి కుమారుడు గోవర్దన్‌రెడ్డి (19) నంద్యాలలో పాలిటెక్నిక్ పూర్తి చేసుకొని బెంగళూరులోని ఓ కంపెనీలో ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. సంక్రాంతి పండగకు సెలవులు రావడంతో ఈనెల 12న స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం తండ్రితో కలిసి పని నిమిత్తం బైక్‌లో అనంతపురం జిల్లా యాడికి పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యంలో తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ మూడవ గేట్ సమీపంలో ఐచర్ వాహనం ఢీ కొనడంతో గోవర్దన్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న తండ్రి సుబ్బారెడ్డి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. కళ్లెదుటే చెట్టంత కుమారుడు రోడ్డు ప్రమాదంలో కన్ను మూయడంతో మృతదేహం మీద పడి బోరున విలపించాడు. పండుగ రోజు యువకుడి మృతితో కొండమీద పల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి సుబ్బారెడ్డి

విద్యుదాఘాతంతో రైతు మృతి

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామంలో కనుమ పండగ రోజు ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పైయింటి రాముడు మొదటి కుమారుడు నరసింహులు (33) ఉల్లి, మిరప పంటలు సాగు చేశాడు. మంగళవారం ఉదయం ఆ పంటలకు నీళ్లు కట్టేందుకు తుంగభద్ర నదీతీరంలో ఉన్న విద్యుత్ మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ప్రమాదశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. మోటరు ఆన్ చేసేందుకు వెళ్లిన నరసింహులు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా విఘతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మన్మథ్ విజయ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


నరసింహులు (ఫైల్)

భక్తుల చెంతకే పాండురంగడు


పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


సాదరదిన్నెలో పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకుంటున్న చిన్నారులు

- వైభవంగా పార్వేట ఉత్సవం
- ఉపవాస దీక్షలతో దళితుల మొక్కులు

కోవెలకుంట్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు భక్తుల చెంతకు చేరి పూజలు అందుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం పార్వేట ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి శ్రీసూక్త, భూసూక్త విధానేనా అభిషేకాలు చేశారు. అనంతరం సాదరదిన్నె, అమడాల గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. స్వామి పార్వేటను పురస్కరించుకుని ఎస్సీ కుటుంబాల్లోని వ్యక్తులు ఉపవాసదీక్షలు ఆచరించారు. పాండురంగస్వామి అశ్వవాహనంపై ఊరేగింపుగా గ్రామంలోకి రాగానే ఆ కుటుంబాలకు చెందిన చిన్నారులు పొర్లుదండాలతో స్వామివద్దకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఉపవాసదీక్ష విరమించారు. అక్కడి నుంచి పాండురంగని ఊరేగింపు అమడాల గ్రామానికి చేరుకోవడంతో ప్రజలు ఘనస్వాగతం పలికి పూజలు చేశారు. పార్వేట సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

దొంగలు ఊడ్చేశారు

- కర్నూలు, ఆదోనిలో దొంగలు హల్‌చల్
- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీ


కర్నూలు...ఆర్టీసీ కాలనీలోని సీసీ పుటేజీలో రికార్డు అయిన దొంగల చిత్రాలు

కర్నూలు : దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చేతివాటం ప్రదర్శించారు. కర్నూలు శివారులో వరుసగా నాలుగిళ్లలో, ఆదోని పట్టణంలో వరుసగా ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.

కర్నూలు–డోన్ 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన మిస్టర్ ఇడ్లీ సమీపంలో ఉన్న ఆర్టీసీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి దొంగలుపడి వరుసగా నాలుగిళ్లను లూటీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వీరశేఖర్, జగదీశ్వర్‌తో పాటు అథినా స్కూల్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు చెందిన రెండిళ్లు వరుసగా ఉన్నాయి. వీరశేఖర్ కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి పండుగకు జమ్మలమడుగుకు వెళ్లారు. అలాగే జగదీశ్వర్ కుటుంబ సభ్యులు కూడా స్వగ్రామం పగిడ్యాలకు వెళ్లారు. అథినా స్కూల్ వాచ్‌మెన్ వెంకటేశ్వర్లు విధులకు వెళ్లగా కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు కాలనీలో ప్రవేశించి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వీరశేఖర్ ఇంట్లో దేవుని గుడిలో ఉంచిన హుండీ పగులగొట్టి అందులో ఉన్న రూ.6 వేలు నగదు, జత కమ్మలు, వెంకటేశ్వర్లు ఇంట్లో రూ.40 వేలు నగదు, తులం బంగారం, జగదీశ్వర్ ఇంట్లో రూ.2 వేలు నగదుతో పాటు వెండి వస్తువులను మూటగట్టుకుని ఉడాయించారు. మంగళవారం ఉదయం కాలనీ ప్రజలు గుర్తించి ఆయా ఇళ్ల యజమానులకు సమాచారమివ్వగా వారు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు.


ఆదోని.. బీరువాలోని వస్తువులను చిందరవందరగా పారవేసిన దొంగలు

బాధితుల ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం తన సిబ్బందితో అక్కడికి చేరుకుని నేరం జరిగిన తీరును పరిశీలించారు. సీసీ కెమెరాల పుటేజీని సేకరించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2 నుంచి 3 గంటల మధ్య 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నలుగురు యువకులు కాలనీలో సంచరించినట్లు సీసీ పుటేజీలో నిక్షిప్తమై ఉండగా పాత నేరస్తులతో వాటిని పోల్చి చూస్తున్నారు. గత నెల 20వ తేదీ కూడా అదే కాలనీలో నివాసముంటున్న మెడికల్ రెప్ శ్రీధర్ ఇంట్లో కూడా దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నగలు, నగదును మూటగట్టుకుని ఉడాయించారు. మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి ఇంట్లో కూడా అదే రోజు దొంగలు పడి నగదు, నగలు తస్కరించినట్లు సమాచారం. 20 రోజులు కూడా గడవక ముందే మరోసారి నాలుగిళ్లల్లో చోరీ జరగడంతో కాలనీ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జాతీయ రహదారికి కాలనీ ఆనుకుని ఉండటం, పోలీసుల గస్తీ అంతంతమాత్రంగా ఉండటంతో దొంగలకు అవకాశంగా మారింది.

ఆదోనిలో..

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఇందిరానగర్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న టీచర్స్ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు వరుసగా ఐదిళ్లలో చొరబడి మొత్తం 11 తులాల బంగారం, రూ.66 వేలు నగదును ఎత్తుకెళ్లారు. పండుగ సందర్భంగా ఆయా ఇళ్ల యజమానులు బంధువుల ఊర్లకు వెళ్లగా ఈ ఘటన జరిగింది. దొంగలు టీచర్ పెద్దయ్య ఇంట్లో మూడున్నర తులాల బంగారం, రూ.16 వేలు నగదు, డాక్టర్ జావిద్ ఇంట్లో ఆరున్నర తులాల బంగారం, రూ.50 వేలు నగదు, ప్రతాపరెడ్డి ఇంట్లో ఒక తులం బంగారం దోచుకెళ్లారు. అదేవిధంగా ఈరన్న, భీమరాజు ఇళ్లల్లో ఏమీ దొరకకపోవడంతో వెనుదిరిగినట్లు బాధితులు తెలిపారు. స్థానికుల ద్వారా చోరీ విషయం తెలియగానే టూటౌన్ సీఐ గోపీచంద్ సంఘటనా స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

గద్వాల వృషభాల జయకేతనం

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పడమర ప్రాతకోట అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సౌజన్యంతో అంతర్ రాష్ట్రస్థాయి న్యూ కేటగిరి విభాగం వషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా గోర్లఖాన్ దొడ్డి వృషభాలు ప్రథమ విజేతగా నిలిచాయి. పోటీలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ప్రారంభించారు. రెండో స్థానంలో కడప జిల్లా రంగసాయి పల్లె ఎం. వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు, మూడో స్థానంలో కర్నూలు జిల్లా మాసామసీదు రమేష్‌నాయుడు వృషభాలు, నాల్గవ స్థానంలో పగిడ్యాల గ్రామానికి చెందిన కోరల గిరిజ ఎద్దులు, ఐదవ స్థానంలో వెలుగోడు అయూబ్ బాషా వృషభాలు నిలిచాయి. విజేతలైన వృషభాల యజమానులకు నగదు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, దాతలు ఖాసీం సాహెబ్, కట్టుబడి నూర్‌బాషా, కుమ్మరి భూపాల్, గోకారిసాహెబ్, అస్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

భజంత్రీ సేవలను కొనసాగించండి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన భజంత్రీ సేవలను కొనసాగించాలని ఆ గ్రామ సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం కాల్వబుగ్గ దేవస్థానంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొన్నేళ్ల నుంచి గ్రామంలో పండుగలు, ఉత్సవాల సందర్భంగా భాజాభజంత్రీల మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుతో తీసుకెళ్లడం ఆనాధిగా వస్తున్న సంప్రదాయం అన్నారు. అందుకుగాను పూర్వీకులు భజంత్రీ సేవలకులకు 86.5 ఎకరాల మాన్యం భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అయితే భజంత్రీ సేవకులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో గత ఏడాది నుంచి ఆలయ సంప్రదాయ ప్రకారం జరగాల్సిన స్వాముల వారి బిందేసేవలు నిలిచిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈఓ ప్రసాద్ కల్పించుకొని భజంత్రీ సేవకులను పిలిపించి వారం రోజుల్లో బిందేసేవలను యధావిధిగా కొనసాగించాలని కోరారు.

ముగిసిన ఉరుసు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురంలో వెలసిన సయ్యద్ మీరసావలి సాసర్ షరీఫ్ ఉరుసు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మూడు రోజులుగా నిర్వహించిన స్వాముల వారి ఉరుసు మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ముగింపు రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాముల వారికి కాయ, చక్కెర సమర్పించు మొక్కులు తీర్చుకున్నారు. మరికొంత మంది భక్తులు జెండాలు ఎక్కించి, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ప్రసాదాలను తీసుకొచ్చి స్వాములవారికి సమర్పించారు.

వాలీబాల్ విజేత చింతమానుపల్లె జట్టు

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీలలో మండల జట్టుగా చింతమానుపల్లె జట్టు విజేతగా నిలిచింది. మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా సచివాలయ ఉద్యోగులు నిర్వహించారు. సెమీ ఫైనల్లో కొత్తకోట -1, చింతమానుపల్లె, కొత్తకోట -2, సి.బెళగల్ -2 జట్లు తలపడగా, చింతమానుపల్లె, సి.బెళగల్ - 2 జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో సి.బెళగల్ - 2 జట్టుపై చింతమానుపల్లె జట్టు విజయం సాధించిందని పీడీలు వెంకటేశ్వర్లు. సుంకారావు తెలిపారు.

సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి

మహానంది: మహానందిలో సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తనయుడు, నియోజకవర్గ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఆయన శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర రెడ్డిలతో చర్చించారు. అనంతరం ఓంకారం, కృష్ణనంది క్షేత్రాలకు వెళ్లి పూజలు చేపట్టారు. ఓంకారం చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డిలు కార్తీక్‌రెడ్డికి స్వాగతం పలికారు.

గిరిజన సంప్రదాయాలు కాపాడాలి

శ్రీశైలం: చెంచు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాన్ని, కళలను కాపాడాలని కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వై ఆశీర్వాదం అన్నారు. స్థానిక మేకల బండలో మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం మేకల బండ నివాసి కుడుముల మల్లేష్ చెంచు గిరిజన నైపుణ్యంతో వెదురు బొంగుల బద్దలతో వడ్డాణాలు, కమ్మలు, గాజులు పాపిడి బిళ్ల తయారు చేసి వారి కులదైవమైన శ్రీభ్రమరాంబా, మల్లికార్జునస్వామివారికి అలంకరించారన్నారు. ఇలాంటి కళాకారులను ఐటీడీఏ పీఓ, దేవస్థానం అధికారులు గుర్తించాలని కోరారు.

లావైపోతున్నారు!

- కర్నూలుకు చెందిన వరేష్‌బాబు ప్రైవేటు...

➤ వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన నరేష్‌బాబు ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. 35 ఏళ్ల వయస్సున్న అతనికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. ఇటీవల అతనికి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి తరలించేలోగా కన్నుమూశాడు. దీంతో చిన్న వయస్సులోనే అతని భార్యాపిల్లలు అనాథలయ్యారు.

➤ కోడుమూరుకు చెందిన ఆంజనేయులుకు 30 ఏళ్లు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి పొగ, మద్యం తాగడం అలవాటున్నాయి. ఒకరోజు ఓ వివాహ ఫంక్షన్‌లో నృత్యం చేస్తూ కింద పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు అతనికి గుండెపోటు వచ్చిందని చెప్పి స్టంట్ వేసి డిశ్చార్జ్ చేశారు.

➤ వీరిద్దరే కాదు జీవనశైలిలో వచ్చిన మార్పులతో చాలా మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. పేద, ధనిక అన్న తేడా లేకుండా చాలా మంది కదలికలేని జీవనవిధానం, ఆహార అలవాట్ల కారణంగా స్థూలకాయులవుతున్నారు. ఫలితంగా మూడు పదుల వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల కర్నూలు నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో స్థూలకాయం కారణంగా వచ్చిన వ్యాధులతో బాధపడే వారే అధికంగా ఉంటున్నారు.

- మితిమీరిన ఆహార సేవనం
- ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్
- వ్యాయామం లేకపోవడంతో స్థూలకాయం
- ఫలితంగా బీపీ, షుగర్, గుండెజబ్బులు
- సమాజంలో పెరుగుతున్న విష సంస్కృతి



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 220కు పైగా ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు రిజిస్టరయ్యాయి. ఇవి గాక అనధికారికంగా మరో 400 క్లినిక్‌లు జిల్లాలో కొనసాగుతున్నాయి. ఆయా ఆసుపత్రులు, క్లినిక్‌లలోని వైద్యుల వద్దకు ఇటీవల కాలంలో దీర్ఘకాలిక జబ్బుల బారిన పడి చికిత్స కోసం వచ్చేవారే అధికమయ్యారు. ఇందులో బీపీ, షుగర్‌తో పాటు గుండెజబ్బులున్న వారే ఎక్కువగా ఉన్నారు. వీరిలో 40 నుంచి 50 ఏళ్లు పైబడిన వారు ఉండటంతో కొందరు పాతికేళ్ల వయస్సులోనూ ఆసుపత్రులకు వస్తున్నారు. కర్నూలు నగరంలో 30 మంది దాకా కార్డియాలజిస్టులు ఉండగా వారి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 30 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో ఇటీవల కాలంలో 5 శాతం మంది యువకులు ఉంటున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే జనరల్ ఫిజీషియన్లు, ఎండోక్రైనాలజిస్టుల వద్దకు సైతం మధ్యవయస్సు వారే దీర్ఘకాలిక వ్యాధులతో ఎక్కువగా వస్తున్నారు. సమాజంలో 20 శాతం మంది షుగర్, 15 శాతం మంది బీపీతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం స్థూలకాయమేనని, బరువు తగ్గితే ఆయా వ్యాధులు తగ్గుముఖం పడతాయని వారు సూచిస్తున్నారు.

స్థూలకాయంతో గుండెజబ్బులు

మారిన ఆహారపు అలవాట్ల కారణంగా స్థూలకాయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీని వల్ల గుండెజబ్బుల బారిన పడే అవకాశం ఉన్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి విభాగానికి చికిత్స కోసం వచ్చే రోగుల్లో 40 ఏళ్లలోపు వారే 25 శాతం వరకు ఉంటున్నారు. అందులో అధిక శాతం ఊబకాయులే ఉంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌తో పాటు బిర్యానీలు, రెస్టారెంట్లలో లభించే వేపుడు పదార్థాల కారణంగా రక్తనాళాల్లో విపరీతంగా కొవ్వు పేరుకుపోయి గుండెజబ్బులకు దారి తీస్తున్నాయి.

స్థూలకాయం తగ్గించుకుంటే మేలు

బాడీ మాస్ ఇండెక్స్ 25.5 దాటిన వారందరినీ స్థూలకాయులుగా సూచిస్తారు. ఇలాంటి వారు బరువు తగ్గేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆహారంలో తీపి, నూనె, కొవ్వు పదార్థాలు తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. దూమ, మద్యపానాలకు దూరంగా ఉండాలి. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ మానేయాలి. బిర్యానీల జోలికి వెళ్లకూడదు. ఒకేసారి ఎక్కువ బరువు తగ్గాలని గాకుండా క్రమంగా క్రమపద్ధతిలో వైద్యుల సూచన మేరకు బరువు తగ్గేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఊబకాయంతో పొంచి ఉన్న వ్యాధులు ఇవే..

- ఊబకాయంతో రక్తపోటు, మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువ
- స్థూలకాయం ఉన్న వారిలో 15 శాతం మందిలో పిత్తాశయంలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది
- స్థూలకాయం కారణంగా ఫ్యాటీ లివర్ ఏర్పడి దీర్ఘకాలంలో తీవ్ర కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- ఊబకాయంతో మోకీళ్లపై భారం అధికమై చిన్న వయస్సులోనే మోకాళ్లనొప్పులు వచ్చే అవకాశం ఉంది.
- కిడ్నీలపై ఒత్తిడి అధికమై ఫిల్టర్లు దెబ్బతింటాయి. దీనివల్ల మూత్రంలో ప్రొటీన్లు ఎక్కువగా లీక్ అవుతాయి.

యువకుల్లో గుండెజబ్బులు పెరిగాయి



ఇటీవల కాలంలో మా వద్దకు వస్తున్న హృద్రోగుల్లో 20 శాతం మంది 30 నుంచి 50 ఏళ్లలోపు వారు ఉంటున్నారు. గతంలో ఇది కేవలం 5 నుంచి 10 శాతం లోపే ఉండేది. దురలవాట్లు, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, మానసిక ఒత్తిడి , జన్యుపరమైన కారణాలు దీనికి ప్రధాన కారణం. అలవాట్లు మార్చుకుని ఒత్తిడి తగ్గించుకోవాలి. ఇందుకోసం వ్యాయామం, ధ్యానం చేయాలి. బీపీ, షుగర్ నియంత్రణలో ఉంచుకోవాలి. సమతుల ఆహారం గురించి పాఠశాల నుంచే పిల్లలకు నేర్పించాలి.

–డాక్టర్ చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

పాశ్చాత్య సంస్కృతితోనే ఊబకాయం



ఇటీవల కాలంలో పాశ్చాత్య సంస్కృతి ఎక్కువైంది. ఇది ఆహారంలో మరీ అధికమైంది. దీనివల్ల ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్, ఫ్రైడ్ ఐటమ్స్ తినడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువై గుండెపోటు, బీపీ, షుగర్ వస్తున్నాయి. దీనికితోడు శారీరక వ్యాయామం ప్రతి ఒక్కరిలోనూ తగ్గిపోయింది. ఫలితంగా చిన్నపిల్లల్లో కూడా ఊబకాయుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రతిరోజూ 45 నిమిషాలు బ్రిస్క్ వాకింగ్ చేయడం, ఆహారంలో మార్పులు చేసుకోవడం చేయాలి.

–డాక్టర్ ఎం. మహేశ్వరరెడ్డి, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

క్రైస్తవ సమాజ అభివృద్ధికి కృషి చేస్తా



సీఎస్ఐ సమాధులతోట శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్) : నగరంలో క్రైస్తవుల సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక జోహరాపురం వద్ద సీఎస్ఐ సమాధుల తోట, అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపన, శిలాఫలకం అవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సమాధుల తోట మంజూరుకు కృషి చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.60 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ తమ చర్చికి సంబంధించి చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించడంలో మాజీ ఎమ్మెల్యే చూపిన చొరవకు సీఎస్ఐ చర్చి సంఘం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నటు చెప్పారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి విరాళాలు

మహానంది: మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ కోసం మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన నరసింగరావు, కుటుంబ సభ్యులు రూ. 5116, గో సంరక్షణ నిధికి రూ.5,000 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఆలయం అభివృద్ధికి దాతల సహకారం ఎంతో ఉందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించొద్దు



మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం రైతులపై కరెంట్ భారాన్ని మోపేందుకు వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను బిగించేందుకు పూనుకుందన్నారు. ఈవిషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రహించకుండా రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. భవిష్యత్‌లో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

వడ్డెర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న వడ్డెర నేతలు

కర్నూలు(అర్బన్): నగరంలోని నాగేంద్రనగర్ లక్ష్మీ వెంకటేశ్వర వడ్డెర కమ్యూనిటీ హాల్‌లో వడ్డెర సంక్షేమ సంఘం ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్లు తమ హక్కుల సాధన కోసం ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని, క్వారీల్లో వడ్డెర్లకు 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మద్దిలేటి, లక్ష్మయ్య, బజారప్ప, గురుస్వామి, కొలుట్ల, చంద్రికమ్మ, రాధిక, రుక్మిణి, ధనుంజయ, శ్రీశైల అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి మార్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే పెద్ద మసీదు నిర్మాణం



మాట్లాడుతున్న మసీదు కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 542 సర్వే నెంబర్ భూమి పై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని, ఎల్లో మీడియా అసత్యాలను, అవాస్తవాలను ప్రచారం చేస్తుందని వక్ఫ్‌బోర్డు, మసీదు కమిటీల సభ్యులు ఖాజమియ్య, మహబూబ్‌బాష, హుస్సేన్ సాబ్ మండిపడ్డారు. ఎమ్మెల్యే సహకారంతోనే తాము అక్కడ పెద్ద మసీదు నిర్మిస్తున్నామన్నారు. మంగళవారం సాయంత్రం హజరత్ మౌలాన యూసుఫ్ సాబ్ రహమతులలఅలై దగ్గర వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మసీదులు, దేవాలయాలు, చర్చిలపై రాజకీయాలు చేయడం తగదన్నారు. మసీదు నిర్మాణం జరగకూడదనే దురుద్దేశంతోనే కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మైనార్టీలు కలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమ్మె 36వ రోజు కొనసాగింది. మంగళవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. కార్యక్రమంలోనాయకులు సీహెచ్ సాయిబాబా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా



ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య, యువజన సమాఖ్య సభ్యులు

కర్నూలు : దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో 7 సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడిన బోయ మునిరంగడుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం జరిపిన మునిరంగడును ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కొండారెడ్డిబురుజు దగ్గర ఉన్న ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం నాయకురాలు విజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రావణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా సమాఖ్య, యువజన సమాఖ్య ప్రతినిధి బృందం అడిషనల్ ఎస్పీ నాగరాజును కలసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. బోయ మునిరంగడుపై కఠిన చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్‌ఐ, ఐద్వా, ఎస్ఎఫ్‌ఐ, పీఎన్ఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ బహుమతులను ప్రదానం చేశారు. 40 సంవత్సరాలుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వార్డులోని ప్రజలు పాల్గొని పోటీపడడం శుభపరిణామం అన్నారు. అలాగే ముజఫర్ నగర్‌లోని రెండు ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ,. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (కల్చరల్)/కల్లూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 29వ వార్డులో మంగళవారం సాయంత్రం కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో శరీన్ నగర్‌లోని వైఎస్సార్ సర్కిల్ దగ్గర ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు శారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ముగ్గులను చూస్తుంటే గ్రామీణ ప్రాంతాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి బహుమతి లీలావతి (టీవీ), రెండో బహుమతి సుమలత(వాషింగ్ మిషన్), మూడో బహుమతి రేణుక (వాటర్ గ్రీజర్), నాలుగో బహుమతి జానకి (మిక్సీ) అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, అరుణ, చిట్టెమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు శివారెడ్డి, నాగమద్దిలేటి, సోమేష్, హేమలత, భూపాల్‌రెడ్డి, హుస్సేన్ ఆలం తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 28వార్డు లక్ష్మీపురంలో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో, 36వ వార్డులో సోమవారం సాయత్రం డిప్యూటీ మేయర్ రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరై విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

● ఉలిందకొండ, కె.మార్కపురం గ్రామాల్లో సంక్రాతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉలిందకొండలో ముగ్గుల పోటీతో పాటు ఆటో రివర్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి బహుమతులు అందజేశారు.

● సంక్రాంతి వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక గోసంరక్షణ శాలలో గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గోశాల ఈవో హనుమంతరాయ చౌదరి గోపూజ నిర్వహించారు. గంగిరెద్దులకు చీరె, సారె సమర్పించారు.

● తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని కల్లూరులోని అవధూత రామిరెడ్డి తాత సంస్థాన్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయం

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 31 ఆరాధన మహోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అవధూత రామిరెడ్డి తాత ఎంతోమందిని సన్మార్గంలో నడిపించారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రరెడ్డి, కోశాధికారి హనుమంతురెడ్డి, మల్లు వెంకటరెడ్డి, శ్రీరాములు, రైతు సంఘం నాయకులు రంగప్ప, లలితా పీఠం పీఠాధిపతులు శ్రీగురుమేడా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



శ్రీ అవధూత రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దంపతులు

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కర్నూలు : ఆత్మకూరు మండలం దుద్యాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఓ మహిళను హైదరాబాద్‌కు తీసుకెళ్లి కొంతకాలం సహజీవనం చేసి తిరిగి తాండ్రపాడుకు తీసుకు వచ్చి వదిలేశాడు. సోమవారం రాత్రి మహిళ భర్త, కుటుంబ సభ్యులు కలసి వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య

కర్నూలు కల్చరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ జిల్లాల విభజన తరువాత సాగునీటి పథకాలన్నీ నంద్యాలలో ఉన్నాయన్నారు. జిల్లాలో తాగునీరు కూడా దొరకని స్థితి నెలకొందన్నారు. గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చే స్తామని అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఆచరణలో పట్టడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి మొదటి వారంలో 5 రోజుల పాటు గుండ్రేవుల నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కర్నూలు అసెంబ్లీ మాజీ కన్వీనర్ రంగస్వామి, జిల్లా నాయకులు కాళింగి నరసింహ వర్మ, కాశీ విశ్వనాథ్, సందడి సుధాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు మాలతి, కోడుమూరు అసెంబ్లీ కన్వీనర్ ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులపై నిర్దిష్ట ప్రణాళిక ప్రకటించాలి

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాల్లోని సాగు నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి తెలుగు దేశం పార్టీ తన నిర్దిష్ట ప్రణాళికను ఎన్నికల మ్యానిఫెస్టో లో పెట్టాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి నాయకులు మంగళవారం మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ నేత కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిని కోరారు. ఈ అంశంపై మంగళవారం కోట్లను ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సాగు నీటి సాధన సమితి నాయకులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో శాశ్వత కరువు నివారణకు సాగు నీటి ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు, సిద్దేశ్వరం అలుగు నిర్మించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సాగు నీటి సాధన సమితి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో న్యాయమూర్తులు

మహానంది: అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మహానందికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక యాగశాలలో న్యాయమూర్తి దంపతులకు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేద పండితుల ఆశీర్వచనం చేయించారు. అలాగే గుంతకల్లు సీనియర్ సివిల్ జడ్జి మంజుల, రైల్వే కోడూరు సీనియర్ సివిల్ జడ్జి అంజనా ప్రియదర్శిని వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు.